# తపన

"చిన్నపిల్లవి. నీకు గుండె నొప్పేమిటమ్మా?! ఫిగర్ కాపాడుకోడానికని మరీ నాజూగ్గా తినక శుభ్రంగా తిను" మందులచీటీ యిస్తూ రాగిణితో చెప్పింది డాక్టర్ శ్రుతి.

"మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి మేడమ్. మీ పనయేదాకా కూర్చుంటాను" దిగాలుపడిన ముఖంతో శ్రుతి పనయేదాకా కాచుకుకూర్చుంది రాగిణి.

"మీరు మావారితో ఒక విషయం చెప్పి ఒప్పించాలి మేడమ్!" రాగిణి మాటలు విని గలగల నవ్వింది శ్రుతి.

"లవ్ మేరేజ్ జంట. మీరొకర్నొకరు ఒప్పించుకోవడం కష్టమయి మూడో వ్యక్తి కల్పించుకోవలసిన అవసరం రావడమా?" మందలింపుగా ఆమె వంక చూసింది శ్రుతి.

"పెళ్ళయిన ఆరునెల్లకే ఆ ఛాప్టర్ క్లోజయిపోయింది మేడమ్" ఆత్మన్యూనతతో తలదించుకుని చెప్పింది రాగిణి. ఒక నిమిషం ఆగి మళ్ళీ చెప్పసాగింది.

"మాది తొందరపాటో, ఆకర్షణో, వ్యామోహమో... ఏం పేరు పెట్టాలో నాకు తెలియడంలేదు. కాని ఒకరి గురించి ఒకరం పూర్తిగా తెలుసుకోకుండా పెళ్ళి చేసుకుందామనే నిర్ణయానికి వచ్చాం. అతని రంగు, రూపు, తియ్యటి మాటలు నన్నొక విధమైన మత్తులో ముంచేసి అతనేది చేసినా అద్భుతంగా, అతనేది మాట్లాడినా అపురూపంగా కనిపించేది. ఆ మత్తులో అతను రాక్‌ఫెల్లర్ కొడుకులా ఎలా బ్రతకగలుగు తున్నాడు, అతని కుటుంబం స్థితిగతులేమిటి, నేను బ్రతుకంతా గడపవలసిన ఇంటి వాతావరణం, మనుషుల మనస్తత్వాలు ఎలాంటివి అని ఒక్కసారి కూడా ఆలోచించలేక పోయాను." రాగిణి అత్తమామలు, ఇంట్లో వ్యక్తులు శ్రుతికి తెలుసు. అందరూ ఏదీ దాచుకోకుండా మాట్లాడే భోళా మనుషులు. ఎంతో సహృదయులుగా, మర్యాదస్తులుగా కనిపిస్తారు. అలాంటి కుటుంబం గురించి రాగిణి ఫిర్యాదేమిటో శ్రుతికి అర్థం కాలేదు.

"తమాషా ఏమిటంటే ఏ యింటికోడలైనా ఆ యింటి స్థితిగతులు బాగోలేకపోతే, కనీసావసరాలు తీరకపోతే బాధపడుతుంది. నా బాధ డబ్బు ఎక్కువవడంతో వచ్చిన సమస్య." అన్నీ విడమరిచి చెప్పడానికే పూర్తిగా నిశ్చయించుకున్న దాన్లా ఏమాత్రం సంకోచం లేకుండా తన విషయాల్ని ఏకరువు పెడుతూంది రాగిణి.

"మా మామగారి ఉద్యోగం సంగతి మీకు తెలిసిందేగదా! పీడించి పీక్కు తినకుండానే ముందు జాగ్రత్తకోసం ఆయనతో అవసరం వున్నవాళ్ళు తమంతట తామే కట్టలు, కట్టలు డబ్బు తెచ్చిపడేస్తారు. మొదటి నుంచి తేలికగా దొరికే డబ్బుకు అలవాటు పడిపోవడం వల్ల డబ్బు విలువ తెలియకుండా రెండుచేతులా ఖర్చు పెట్టేయడం హాబీ అయిపోయింది ఇంట్లోవాళ్ళందరికీ. మీరు పురుళ్ళు పోసిన మా ముగ్గురాడపడుచులు ఈ సౌఖ్యాల్నీ, స్వేచ్ఛను వదులుకుని అత్తారిళ్ళకు వెళ్ళడానికి యిష్టపడరు. మా మామగారు తన పలుకుబడితో అల్లుళ్ళను యిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించారు. మా వారు, మరిది యిద్దరూ ఎమ్.ఏ. పాసయి కూడా ప్రొద్దస్తమానం మోటార్ సైకిలేసుకుని ఊరు బలాదూరు తిరుగుతూ వుంటారు. కొడుకుల్ని ఉద్యోగం సంపాదించుకుని కుదురుగా వుండమని బుద్ధిచెప్పే బదులు 'అమ్మా! డబ్బు' అనగానే వందరూపాయల నోట్లు చేతిలో పెడతారు మా అత్తగారు. దాన్ని రూపాయి నోటును ఖర్చుపెట్టినంత తొందరగా, తేలిగ్గా ఖర్చుపెట్టి జల్సా చేసేస్తారు వీళ్ళు." శ్రుతిని ఓ పేషెంట్ గురించి అడగడానికి నర్స్ రావడంతో ఆమె వెళ్ళేదాకా ఆగింది రాగిణి.

"వెళ్ళిన నాలుగు రోజులకే యింటిని చూసి హడలిపోయాన్నేను. బడబడ వాగుతూ ఉండే మనుషులు, శుచీశుభ్రం లేకుండా ఎక్కడ పడితే అక్కడ బట్టలు, సామానుతో నానా

భీభత్సంగా ఉండే ఇల్లు. నేను పుట్టిపెరిగిన ఇంటికి పూర్తిగా వ్యతిరేకం. ప్రశాంతంగా, డీసెంట్‌గా వుండే మనుషుల మధ్య పెరిగిన నేను ఎల్లప్పుడూ రణగొణ ధ్వనులతో, చేపల బజార్లావుండే యీ యింట్లో మెలగడానికి గాభరాపడి పోయాను... తప్పేది లేదు గనుక రాజీపడిపోవడానికి ప్రయత్నిస్తూ ఇంటిని నీట్‌గా వుంచడానికి అన్నీ సర్దసాగాను. నన్నో వింత జంతువును చూసినట్లు చూసి, తమ సహజవాతావరణం కలుషితమయి నట్లుగా బాధపడిపోయి, ఆ పనులను పొగరుమోతు పనులుగా వర్ణించి వెటకారం చేయసాగారు" తనకు తెలిసిన వ్యక్తుల గురించి కొత్తగా తెలుస్తున్న విషయాన్ని నమ్మలేనట్లు చూస్తుంది శ్రుతి.

"అన్నిటినీ మించి నన్ను ప్రతినిమిషం బాధపెడుతున్న విషయం మరొకటుంది. ఇలా ఎంతకాలం సర్కస్ జంతువుల మధ్య బ్రతికినట్లు బ్రతకడం, ముందుచూపు లేకుండా ఒక్కపైసా కూడా ఆదాచేయకుండా ఎప్పటికప్పుడు ఖర్చుపెట్టేస్తున్న వీళ్ళెలా బ్రతుకు తారు?... ముఖ్యంగా నీతి, నిజాయితీతో కష్టపడి పనిచేసి సంపాదించుకు తినడం మానవ ధర్మం అని మా నాన్నగారి దగ్గర్నుండి నేర్చుకున్న నేను, తేలిగ్గా వచ్చిన ఈ లంచపు తిండిని తినలేకపోతున్నాను. ఇద్దరం పోస్ట్‌గ్రాడ్యుయేట్స్ మయుండి, ఉద్యోగం కోసం ప్రయత్నించి ఉజ్జ్వలమైన భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాల్సింది పోయి సోమరిపోతుల్లా, పరాన్నజీవుల్లా బ్రతకడానికి నాకసహ్యంగా వుంది. రెండు చేతులూ వుండికూడా అవిటి వాళ్ళలా నాబాబు భవిష్యత్తును మరొకరి చేతుల్లో వదిలేయడానికి నా ప్రాణం పోతూంది" రాగిణి గొంతు గద్గదమయి, భావావేశాన్ని ఆపుకోలేక పోయింది.

"ఇద్దరం జాబ్స్ చేసుకుని మన బ్రతుకు మనం బ్రతుకుదామని మా వారికి చెప్పి చెప్పి విసిగిపోయాను... బహుశా నేను ఆవేశంతోనో, బాధతోనో, నాబ్రతుకు నేను కోరుకున్నట్లు లేదన్న ఉక్రోషంతోనో, చెప్పవలసిన విధంగా ఆయనకు చెప్పడం లేదేమో. అందుకే ఆయన వినడం లేదేమోనన్న అనుమానమొస్తుంది. అందుకే మీ దగ్గరకు వచ్చాను. మేడమ్! మీ మాటంటే మా వాళ్ళందరికీ గురి. మీరంటే మావారి కెంతో గౌరవం. మీరు నచ్చచెప్తే వింటారనే ఆశతో మిమ్మల్ని రిక్వెస్ట్ చేస్తున్నాను. ప్లీజ్ మేడమ్!"

ఒక విద్యార్థికుడికి ఉచిత సలహాలు, నీతిబోధలు చెయ్యడం, వాళ్ళ వ్యక్తిగత జీవితాల్లో జోక్యం కలిగించుకోవడం ఎంతవరకుసమంజసమని తటపటాయించిన శ్రుతి, రాగిణి ముఖం చూసి తప్పో, ఒప్పో, సమంజసమో కాదో - అతనికి చెప్పడానికే నిర్ణయించుకుంది.

"మీ స్వశక్తిమీద మీరు బ్రతకాలనే నీ తపనను నేనర్థం చేసుకుంటున్నానమ్మా! రేపోసారి రాజుని తీసుకుని రా." రాగిణి ముఖం పుచ్చపువ్వులా వికసించింది.